
# అనులోమం

ఆడెపు లక్ష్మీపతి




సాయంత్రం ఆఫీసు నుండి వచ్చాక బూట్లు విప్పుకుంటూ మా వారు అన్నారు- ఎల్లుండి సాంబమూర్తి చెల్లెలి పెళ్ళి, రేపు ఉదయమే మనం హైదరాబాదుకు బయలు దేరి వెళుతున్నాం.''

ఉల్లాసకరమైన కబురు. చాలా కాలానికి ప్రయాణం చేయ్యాల్సిన మాకు బంధువుల కంటేనూ ఎక్కువ సన్నిహితులైన వాళ్ల ఇంటిలోని శుభ కార్యానికి తరలి వెళ్లాల్సిన - సందర్భం వచ్చింది. ఉత్సాహంగా సన్నాహాలు ప్రారంభించాను. మా అబ్బాయి కోసం సెలవు చీటీ రాసి స్కూలుకు పంపించాను. రాత్రి పెందలాడే అందరి భోజనాలూ ముగింప జేసి బట్టలు, తదితర సామగ్రి సూటుకేసులో సర్దేశాను.


''పెళ్లికి ఇంకా ఎవరెవరు వస్తున్నారు ఇక్కణ్ణించి?''

''బాలకృష్ణ కూడా.... ఫ్యామిలీతో వస్తున్నాడు - వాళ్లూ, మనం కలిసే వెళ్దాం. మా మిత్ర బృందంలో ఓ పది మంది స్నేహితులు, డిపార్ట్ మెంటులోని కొలీగ్స్ మరో అయిదారుగురు వస్తున్నారు. అయితే వాళ్లంతా ఎల్లుండి లేదా రేపు రాత్రికి బైలుదేరుతారు....'' చెప్పారు మా వారు.

ఉదయం నాలుగు గంటలకే నిద్రలేచి తయారయ్యాం. అయిదు కాక ముందే ఆటోస్టాండుకు చేరుకున్నాం. బాలకృష్ణ వాళ్ల కోసం చూస్తుండగానే ఆటోలు ఒక్కటొక్కటిగా వెళ్లి పోయినై. పది నిమిషాల తర్వాత రావాల్సిన వారు వచ్చారు. వెంట పెద్ద సూటుకేసు, ఒక ఎయిర్ బ్యాగు, మరో భారీ సంచీని మోసుకుంటూ తాపీగా వచ్చారు. బాలకృష్ణ సతీమణి - సావిత్రిని చిరునవ్వుతో పలకరించాను. వాళ్ల అయిదేళ్ల పాపను చేతుల్లోకి తీసుకొని ముద్దు పెట్టుకున్నాను. ఆమె నన్ను కుశల ప్రశ్నలు వేసింది. స్నేహితులిద్దరూ మాకు దూరంగా నిలబడి సిగరెట్లు కాలుస్తూ కబుర్లలో పడ్డారు.

మా వారు, బాలకృష్ణ, సాంబమూర్తి - ముగ్గురూ ఒకే కంపెనీలో పని చేస్తున్న ఉద్యోగులు; గాఢ స్నేహితులు. మూడేళ్ల క్రితం సాంబమూర్తికి బదిలీ అయి హైదగాబాదుకు వెళ్లి పోయాడు. ఆ కుటుంబంతో మాకు బాగా చనువు. నిండు మనసుతో తరచూ రాసుకునే ఉత్తర ప్రత్యుత్తరాలు మా మధ్య దూరానికి వారధిగా నిలిచాయి. బాలకృష్ణ కుటుంబంతో నాకు అంతగా దగ్గరితనం లేదు. నేనూ, సావిత్రీ అరుదుగా ఒకరి ఇంట్లో మరొకరం కల్సుకుంటాం ఒక సారెప్పుడో ఏదో ఫంక్షనులో కలిసినప్పుడు చెప్పింది - ఓపెన్ యూనివర్సిటీలో ఏదో డిగ్రీ చదువుతున్నట్టుగా. ఆమె స్నేహితురాళ్ల సర్కిల్ వేరే ఉంది.





అయిదు నిమిషాలు గడిచాయి. ఆటో స్టాండులోకి ఆటోరిక్షాలు రాలేదు. కనుచూపుమేర అవి రోడ్డు మీద తిరుగాడుతున్న జాడయినా కానరావటం లేదు.

మావారు మాటలు చాలించి గడియారం చూసుకున్నారు. నలువైపులా దృక్కులు సారిస్తూ - "అరే బాలూ..... ఇప్పుడెలారా? టయిమవుతోంది....." అని అన్నారు.

"చేసేదేముంది? రిక్షాల్లో వెళ్దాం పద...." అన్నాడు బాలకృష్ణ.

చౌరస్తా దగ్గర కొన్ని రిక్షా బండ్లున్నాయి. రిక్షావాలాలు చలిమంట వేసుకుని బాతాఖానీ కొడుతున్నారు.

"ఏయ్ రిక్షా..... ఇలా రా...."

రిక్షా వాలాలు మమ్మల్ని గమనిస్తున్నట్టున్నారు. వాళ్లలో వాళ్ళు ఏదో కూడబలుక్కున్నారు. కంబళి ముసుగు కప్పుకున్న రిక్షావాడు నిలబడి, కాలుస్తున్న బీడీ ముక్క విసిరేశాడు. "అరే కోటేశూ..... లేవ్వరా....." అని తన సహచరుల్లో ఒకడ్ని ఉద్దేశించి అన్నాడు. అరనిముషం గడిచాక రెండు రిక్షాలు మా ముందర వాలాయి.

"ఎక్కడికి సారా?.... రైల్వే స్టేషను కేనా?.... ఎక్కండి...."

నా సమీపంలో ఆగిన నల్ల బనీను వాడు మా సూటుకేసు ఎత్తి రిక్షాలో పెట్టాడు. మా అబ్బాయిని ఎక్కించి నన్ను "ఎక్కండి అమ్మగోరూ...." అన్నాడు.

నేను కూర్చుని, ఒదిగి మావారికి చోటిచ్చాను.

రెండో రిక్షాలోకి సావిత్రి వాళ్ల సామాన్లు కూడా ఎక్కాయి. బాలకృష్ణ ఎక్కేందుకు సంసిద్ధుడయాడు.

"ఆగండి! ఏమి టా తొందర? ముందు కిరాయి ఎంతో తేల్చుకోండి. తీరా స్టేషను చేరుకున్నాక పెద్ద మొత్తం ఇవ్వాలని పేచీ పెడతారు వీళ్లు....." భర్తను వారిస్తూ అన్నది సావిత్రి.

బాలకృష్ణ టక్కుమని ఆగాడు - "ఔనౌను. మరచి పోయాను. ఏమోయ్ రిక్షావాలా..... ఎంత బాడుగ?"

కంబళి వాడు సామాన్లను, వ్యక్తులను పరిశీలనగా చూసి, మనసులో లెక్కలు వేసుకున్నాడు కాబోలు - అన్నాడు ; "బాడుగది ఏముందయ్యా..... ఎంతో కొంత ఇద్దరుగానీ.... నాలుగున్నర, నాలుగున్నర - తొమ్మిది రూపాయలియ్యండి....."

"రెండు కిలో మీటర్ల దూరానికి నాలుగున్నరా...? అన్యాయం! మాకు గత్యంతరం లేదు కదా అని ఎక్కువ డబ్బులు గుంజాలని చూస్తున్నారు" అన్నాడు బాలకృష్ణ

"టేషనుకు దూరం రెండు మైళ్లే ఉందనుకోండి - కాని రోడ్డు కొండ మీదికి పోయినట్టుగా నిటారుగా ఉంటాది. ముగ్గురేసి మనుషులు ఉన్నారు. పెద్ద పెద్ద పెట్టెలున్నాయి. పొద్దున బోణీ కదా అని అయిదు రూపాయిల బాడుగను తగ్గించి నాలుగున్నర చేశాం...."

డిసెంబరు నెల చలి అదరగొడుతున్నది. మా పిల్లవాడు ముంగాళ్ల మీద కూర్చుని ఇబ్బందిగా కదులుతున్నాడు. టయిము చూస్తే అయిదున్నర కావొస్తోంది. స్టేషనుకు రైలు బండి వచ్చే సమయం ఆరు గంటలు. ఈ అవస్థలో రూపాయి, అర్థ రూపాయి కోసం బేరం సాగించడం నాకు ఇష్టంలేదు. నేను మా వారి ముఖంలోకి చూస్తూ సైగ చేశాను.

సావిత్రి అందుకుంది ; "అదే ఆటో రిక్షాలో అయితే కుదుపులు లేకుండా, వెచ్చగా అయిదు నిముషాల్లో స్టేషను చేరుకోగలుతాం. ఛార్జీ అయిదు రూపాయల కంటే ఎక్కువ ఉండదు. మీరూ అంతే ఛార్జీ అడుగుతారా? మూడు మూడు రూపాయలిస్తాం - కదులుతారా, లేదా....?"

"ఆటో రిక్షా పెట్రోలు కాల్చుతుంది. మేం....మేం.... మిమ్మల్ని చేర వేయడానికి మా నెత్తురు కాల్చుతాం. పెట్రోలు కంటె మనుసుల రగతం చౌక అయిపోయిందా అమ్మగారూ....?" సినిమా డైలాగులాంటి మాట విసిరాడు రిక్షావాలా.

మావారు జోక్యం చేసుకున్నారు. "ఈ లోపున ఏదన్నా ఆటో రిక్షా వస్తే అందులోనే వెళ్ళిపోతాం. మీ గిరాకీ ఎందుకు వృథాగా వదులు కుంటారు? మూడున్నర చొప్పున ఇస్తాం. వదరండి...."


అంగీకారం కుదిరింది. మెల్లగా రిక్షాలు కదిలినై. నిజంగానే రోడ్డు గతుకులు గతుకులుగానే కాక - మిట్ట దారిగా ఉంది. రెండు చోట్ల రిక్షా వాలాలు దిగి నెట్టాల్సి వచ్చింది. శుభమా అని పెళ్లికి బయలు దేరాం - ఎలాంటి అవాంతరమూ, కాల యాపనా లేకుండా రైలెక్కాలని నా తపన. ఎట్టకేలకు రైల్వే స్టేషను చేరుకున్నాం. బండి పావు గంట లేటు అని తెల్సుకుని తేలికగా ఊపిరి పీల్చుకున్నాం.

రైల్లో ఎక్కువ రద్దీ లేదు. ఇబ్బంది లేకుండానే సీట్లు దొరికాయి. ఇరు కుటుంబాల వాళ్లం ఎదురెదురు సీట్లలో కూర్చున్నాం. రైలు కదిలి వేగాన్ని పుంజుకుంది. మా అబ్బాయి ఈదరగాలి భరించలేక కిటికీ మూసెయ్యమన్నాడు. నేను కిటికీ అద్దం కిందికి లాగాను. నా చర్య సావిత్రికి నచ్చలేదేమో - క్షణకాలం ఆమె వదనంలో అసౌకర్య భావన ద్యోతకమయింది. నీలం రంగు ఎంబ్రాయిడరీ చేసిన కాశ్మీరు శాలువా కప్పుకుని ఆమె వెచ్చగా కూర్చుని ఉంది. సహజంగా అందగత్తె అయిన

[తరువాయి 17వ పేజీలో]

## ఊరు పరిగెడ్తుంది

ఊరు పరుగెడ్తుంది
నగరం పొలిమేరల్లోకి
సంస్కృతి పంచిన కమ్మని పాయసం మరచి
సస్యశ్యామలమైన నేల తల్లిని విడిచి
కారణం, దారుణం
ఆకలి తీరక కాదు
ఆశయాలు నోచక కాదు.
యాతనలు పడతాయని మాత్రమే.
ఎందుకు! ఎందు కండి?
ఆ పరుగు?
ఎందుకు! ఎందు కండి!
ఆ ఉరుకు!
అడక్కు బాబూ! అడక్కు!
గోడలకు రాత లుంటా యిక్కడ
చేనుల్లో బాంబు లుంటాయిక్కడ
తలలకు వెల లుంటా యిక్కడ
ఖాకీ వనంలో అన్నలు
వంటలాడుకుంటా రిక్కడ



చిత్రం-మడపటంగ

డా॥ బి.దామోదర్‌రావు

['అనులోమం' 14వ పేజీ తరువాయి]

ఆమె ఎర్రటి సిల్కు చీరలో - మితంగా అలంకరించుకున్నప్పటికీనీ - ఆకర్షణీయంగా కనబడుతున్నది. ఏదో మ్యాగజైను చదవడంలో లీనమయింది. పావను పెనిమిటి ఆడిస్తున్నాడు.

ఏదో జంక్షనులో రైలాగింది. ఎండ హెచ్చి, చలి తగ్గింది. మా అబ్బాయి "టిఫెన్ కావాలి" అన్నాడు తండ్రితో.

"వదరా బాలూ.... వీళ్లకు తినడానికేమయినా తీసుకొద్దాం...."

"అక్కర లేదు. రెండు రకాల తినుబండారాలు వెంట తెచ్చాం. కూర్చో...." అంటూ బాలకృష్ణ సంచీ తెరిచాడు. తేలిక రకం తినుబండారాలేమిటో పేపరు పేట్లలో పెట్టి అందరికీ పంచాడు. రుచిగా, నీటుగా ఫలహారం ముగిసింది. మావారు అందరికీ కాఫీలు తెప్పించారు. రైలు గమ్యస్థానం వేపు పరుగు అందుకుంది.

"సావిత్రి గారూ.... మీ ఓపిక మెచ్చుకోవాలి. చాలా శ్రమ తీసుకున్నారు. చక్కటి టిఫెన్లు పెట్టారు. థాంక్స్....." అభినందించాను నేను.

"ఆఁ... ఈవిడ శ్రమ ఏమీ లేదు లేవమ్మా..... పనిమనిషి ఉందిగా! ఇంటి పనంతా అదే చూసుకుంటుంది. పాప పుట్టిన తర్వాత రెండేళ్లకు ఈవిడ చదువుకుంటానంది. సరే - అష్టావధానం ఎందుకని పని పిల్లను పెట్టించాను...." హాయిగా నవ్వేస్తూ చెప్పాడు బాలకృష్ణ .

భర్త వేపు క్షణం చు'రుగ్గా చుసి, తర్వాత ముసి ముసిగా నవ్వింది సావిత్రి. మా పెళ్లి కంటె యేడాది ముందు వీళ్ల పెళ్లి జరిగింది. కాని సంతాన ప్రాప్తి ఆలస్యంగా జరిగింది. అందమైన భార్యను అపురూపంగా చూసుకుంటాడు భర్త. అన్యోన్య దాంపత్యమే!

* * * * * * *

**సాం**బమూర్తి దంపతులు అతిథులను సాదరంగా ఆహ్వానించారు. ముఖ్య స్నేహితులు సకుటుంబంగా విచ్చేసినందుకు ఆనందిస్తూనే, చిరుకోపం ప్రకటించారు. "ఏరా బాలూ..... అరేయ్ సత్తులూ.... మీరు పరాయి వాళ్లలాగా ఈ రోజు వస్తారా.... మీకు ఏ మాత్రం బుద్ధి లేదు. చెల్లెమ్మలూ.... మీరయినా చెప్పలేదా.... మీకయినా తట్టలేదా వారం రోజుల ముందుగా ఇక్కడ ఉండాలని! మొన్నటి నుండి ఎదురు చూస్తున్నాను.... మీ రాక ఎప్పుడెప్పుడా అని...." అన్నాడు సాంబమూర్తి. పెళ్ళి కూతురు ఉమ గుర్తు పట్టలేనంతగా ఎదిగింది.. "బాగున్నారా అక్కా....." అంటూ ఆప్యాయంగా పలకరించింది. నేను ప్రేమగా కౌగిలించుకుని నుదుటి మీద చుంబించాను. నన్నగా బంగారు తీగలాగ ముద్దుగా తయారయింది పిల్ల. డిగ్రీ ఫైనల్‌లో ఉందిట. పెళ్ళి కొడుకు ఏదో ఎలక్ట్రానిక్ కంపెనీలో ఇంజనీర్ అంది. జంట బాగుంది. పెళ్లి పెద్ద అట్టహాసం లేకుండా మామూలుగా జరిగి పోయింది.

మధ్యాహ్నం రిసెప్షన్ ముందు - సాంబమూర్తి తన స్నేహితు లిద్దరినీ లోపలికి పిల్చి, ఏదో



తలుపూరు అనసూయదేవి (చిల్లివాక్కం)

విషయమై పావుగంట సేపు చర్చించాడు. మాఆడ వాళ్ల సందడిలో మే మున్నాము. పెళ్లి కూతురిని సరికొత్త పట్టు చీరతో, నగలతో ముస్తాబు చేసే బాధ్యత నేను స్వీకరించాను. సావిత్రి నాకు చేదోడుగా ఉంది. అయితే తన అలంకరణ గురించి ఎక్కువ శ్రద్ధ తీసుకుంది. శిరోజాల స్టయిలును మూడు సార్లు మార్చుకుంది. చీర తర్వాత చీర - ఒక్క రోజులో నాలుగు చీరలు కట్టుకుంది. ఇలా తన స్వంత పనులకు ఎక్కువ సమయం వెచ్చించింది. ఏ మాటకు ఆ మాటే చెప్పుకోవాలి కానీ - ఆమెలో నాకు ఒక గుణం నచ్చింది; ఆమెకు విషయ పరిజ్ఞానం మెండుగా ఉన్నది. మాట తీరులో మంచి సంస్కారం ఉంది. వంటల దగ్గరా, వడ్డనల దగ్గరా ఆలస్యాన్నీ అలసటనూ తెలియనీయకుండా మహిళా బృందాలతో చక్కగా కబుర్లు చెప్పింది.

సాయంత్రం నాలుగ్గంటలకు షాపింగ్‌కు వెళ్లే ప్రోగ్రాం నిర్ణయమైంది. సావిత్రి ఒక ప్రతిపాదన చేసింది - ప్రెజెంటేషన్ ఇరువురమూ కలిపి ఇద్దామని. మేము సరేనన్నాము. మెయిన్ సిటీలోని ఒక పెద్ద షాపులోకి వెళ్లాం. అయిదు నిముషాల మీమాంస తర్వాత సావిత్రి సూచన మేరకు - ప్రసిద్ధ కంపెనీకి చెందిన వాటర్ ఫిల్టర్ ఒకటి ఎంపిక చేశాము. తర్వాత స్వంతానికి ఎవరికి వాళ్లమే మరి కొన్ని సామాన్లు కొనుక్కున్నాము. ఆమె గృహాలంకారానికి సంబంధించిన వస్తువులు, నేను కిచెన్‌లోకి కావాల్సిన ఉపకరణాలు కొన్ని ఖరీదు చేశాం.

షాపులో నుండి ఇవతలికి వస్తూ మెట్లు దిగుతున్నప్పుడు సావిత్రి ఎడమకాలి చెప్పు పట్టీ తెగిపోయింది. మడమ జారి మెలితిరగడం మూలంగా తూలిపడబోయి పెనిమిటి మీద చేయివాల్చి బ్యాలన్సు నిలుపుకుంది.


"కాలు నొప్పిగా ఉందా?" ఆదుర్దాగా అడిగాడు బాలకృష్ణ .

"ఉహూఁ. కాలు బాగానే ఉంది. కాని చెప్పుకు ఈ గతి పట్టింది. ఎలా?" ప్రశ్నార్థకంగా చూసింది.


అటూ ఇటూ చూస్తే అరఫర్లాంగు దూరంలోని బస్సుస్టాపు దగ్గరి చెట్టుకింద మోచీ కనపడ్డాడు.

## కొత్త సంక్రాంతి

అడవులు పుష్పాలను కురిసే
భూగోళం చుట్టూ
రక్తనదులు ప్రవహిస్తున్నాయి
ఏనాడో డబ్లిన్‌లో కదిలిన రక్తనదుల
భయానక నృత్యాలు నేడు
ఈజిప్టు నుంచి ఇండియా వరకు
కాశ్మీరు నుంచి కంబోడియా వరకు
భూగోళాన్ని ఏ యుగంలోనూ ఎరగనంత
భయానక నరకం చేశాయి
మతం పేరుతో మానవతలను వధించాయి
జాతి పేరుతో నిజాయితీని నిర్మూలించేశాయి
రక్తపాతానికి రాజకీయ కుటిలత్వం
రహదారయి పోయింది
ఈ సంవత్సరం పోయిందని ఎవరు ఏడుస్తారు?
ఈ శతాబ్దం పోయిందని ఎవరు ఏడుస్తారు?
ఈ శతాబ్ది లాభనష్టాలు చూస్తే కాదు చూస్తే
సగటు మనిషి బ్రతుకులో నాటికీ
నేటికి మార్పు ఏది?
ఎందరు నేతలు ఈ శతాబ్దిలో మన ఓట్లు
తీసుకుని అందల మెక్కలేదు - కానీ ఓ భాయీ!
సత్యం చెప్పినందుకు చంపబడిన వాడినే
ప్రతి కొత్త సంక్రాంతీ మనకు
జ్ఞాపకం చేస్తుంది -




బి.బాల్‌రాజ్



## శృంగార సంక్రాంతి

చేమంతుల పూబంతుల
సామంతము తోడ పౌష్య సంక్రాంతి శ్రీ
భామా కలాపములతో
శ్రీమంతంబై వెలింగె శృంగార కళన్॥

తగ్గని సొంపు లొల్కగ రథమ్ముల
ముగ్గిడు ఆ మరందలిన్
డగ్గఱి మెచ్చుకొంచు వదినల్
చిరునవ్వున "ముగ్గులోనికిన్
డిగ్గగ జేయు జాణవేయటే!
అటు చూడ"న కొంటె చూపులన్
వగ్గము వేయు భర్త గని భామిని
లోనికి నేగె సిగ్గునన్॥

డా॥ రామడుగు వెంకటేశ్వర శర్మ

అక్కడికి వెళ్లాం. మోచీ చెప్పు తీసుకుని పరీక్షించాడు. పాత వేమీ కావు - ప్రముఖ కంపెనీ తయారు చేస్తున్న తోలు చెప్పు లవి.

"రెండు వేపులా కుట్టి పాలిష్ చేస్తాను. ఆర్రూపాయ లవుతది" అన్నాడు మోచీ.

సావిత్రి తల అడ్డంగా ఊపింది. "ఈ మాత్రం దానికి ఆర్రూ పాయలా?.... డబ్బు ఊరికే వస్తుందటయ్యా మాకు.... నాలుగు రూపాయ లిస్తాను. బాగుచెయ్యి."

"రుపాల్ ఉట్టిగనె ఎట్లవస్తయమ్మా.... ఎవ్వాల్లయినా కస్టమె. మళ్లీ, రేట్లు మస్తుగ పెరిగి పాయె. దారం, ఇగో గీ రంగు,గీపాలిష్ డబ్బుల దరలు డబల్ అయినయీ. మాకు ఏం పడుత లేదు. ఇంకోరూపాయియ్యండ్రి....." అన్నాడు మోచీ.

ఒక్క పైసా కూడా ఎక్కువ ఇవ్వనంది సావిత్రి. నువ్వు కాకపోతే ఇంకోడి దగ్గరికెళ్లి కుట్టిస్తానంది. మోచీ తలెత్తి ఆమె వేపు చూసి, చూపులు దించి, "సరేనమ్మా పది నిముషాలాగి రాండ్రి...." అన్నాడు.

ఎదురుగా మంచి రెస్టారెంటు కనపడింది. ఆ కొద్ది సమయం గడుపుదామని అందులో దూరాం. మా వారు టీకి ఆర్డరిచ్చారు.

టీ చప్పరిస్తూ అడిగాను మావారిని "మధ్యాహ్నం మీ మిత్రులతో సాంబమూర్తి ఏదో ప్రత్యేక విషయం మాట్లాడాడు. ఏమిటీ సంగతి?"

"ఏమీ లేదు. పెళ్ళి కొడుకు తరపు వాళ్లు వాళ్ల దేదో ఆచారం ప్రకారం ఈ నెలలోనే లగ్నం కావాలని నిర్ణయించడంతో మనవాడు డబ్బు గురించీ, మిగతా ఏర్పాట్ల గురించీ చాలా హైరానా పడాల్సి వచ్చింది. లోన్ తీశాడట. ఆ మొత్తం సరిపోలేదట. సమకూర్చాల్సిన లాంఛనాలు కొన్ని మిగిలి పోవడంతో నెల రోజులు గడువు అడిగాడట మగ పెళ్లి వారిని. ఈ విషయమే మాకు వివరించి, చెరొక అయిదు వేలు సర్దుబాటు చెయ్యమన్నాడు....." చెప్పారు మావారు - మెల్లగా నాకే వినబడేటట్టుగా.

"మరి మీ రేమన్నారు?"

"నేను సరేనన్నాను. వీడు - బాలకృష్ణ స్పష్టంగా హామీ ఇవ్వలేదు. తనకేవో ఖర్చులున్నాయన్నాడు; ప్రయత్నం చేసి తరువాత చెబుతానన్నాడు..."

"మీరు బోళా మనిషి. మీ మిత్రుడు తెలివైన వాడు."

"దీనికి అంత పెద్ద మాటలు ఉపయోగించాల్సిన అవసరమేమున్నది? పాపం సాంబమూర్తిది పెద్ద కుటుంబం. వాడికి బాధ్యతలె ఎక్కువ. వాడికి ఇంకెవరున్నారు ఆప్తులు? ఉమ నీ చెల్లెలే అనుకోరాదూ? ఇక బాలూ గా డంటావా.... వాడూ అర్థం చేసుకోగలడు. నేను మాట్లాడతాను....."

"అతని సంగతి వదిలెయ్యండి. అంత డబ్బు మీరు ఎక్కణ్ణించి తెస్తారు?"

"పెద్ద సమస్య కాదు. ఈ నెల, ఇన్సూరెన్సు పాలసీ చెక్కు ఒకటి రాబోతోంది. ఆ మొత్తం ఇటు ఇద్దాం. ఏమంటావ్?"

"మీ ఇష్టం."

టీ త్రాగడం ముగించాం. బాలకృష్ణ ముందర పడి బిల్లు చెల్లించాడు. వచ్చిన చిల్లర డబ్బులను వెయిటర్‌కు టిప్పుగా వదిలేశాడు.

మోచీ సావిత్రి చెప్పులు బాగుచేశాడు. కొత్తవాటిలాగా తళ తళమంటున్నాయి. వాటిని సంతృప్తిగా చూసుకొని తొడుక్కుంది. ఒక రూపాయి ఎక్కువ ఇస్తుంది కాబోలు మోచీకి అనుకున్నాను. ఊహూ... కచ్చితంగా తను ముందు అన్న ప్రకారమే ఇచ్చింది.

అక్కణ్ణించి కదిలాం. నడుస్తూ బాలకృష్ణ భార్య వైపు చూస్తూ అన్నాడు. "వెళ్లి పోదామా - ఇంకేమయినా కొనాల్సినవి ఉన్నాయా?"

సావిత్రి హ్యాండు బ్యాగు తెరిచి ఒక స్లిప్పు చూసుకుంది. "బట్టల షాపుకు వెళ్లాల్సి ఉంది..." నా వేపు తిరిగి, "సిటీకి వచ్చాం కదా! మంచి వెరయిటీ చీరలు చూద్దాం. వచ్చేది వేసవీ కాలం. కొత్త ఫేషను కాటన్ చీరలు తీద్దాం...." అంది.

నేను తల వూపాను.

కొంత దూరం నడిచాక, ఆమె, ఒక అధునాతనంగా కనబడితున్న 'శారీ హౌజ్'లోకి దారితీసింది.

షాపు చాలా విశాలంగా ఉంది. అంతర్భాగం దీపాల వెలుతురులో వింతగా శభలీనుతున్నది. వివిధ రకాల చీరలు కళ్లు జిగేల్మనిపించేటంత వెరయిటీలు, వయ్యారం వొలక బోస్తున్న షోకేసుల్లోని బొమ్మలు - ఇవి కస్టమర్లను ఉత్త చేతులతో 'వెళ్లొద్దన్నట్టు' శాసిస్తున్నాయి.

అరగంట వెచ్చించి ప్రింటెడ్ కాటన్ చీరలు సెలక్టు చేసుకున్నాము. ధర మాత్రం అధికంగా అనిపించింది నాకు. బేరమాడి కొంచెం తగ్గించేలా చేస్తే బాగుండునన్న నా ఆలోచనకు నాకే నవ్వు వచ్చింది. ఇంత పెద్ద ఎంపోరియంలో అలా అడగడం అవివేకం. హాండు కర్చీఫ్‌లు తీసుకున్నంత తేలికగా సావిత్రి మూడు చీరలు మ్యాచింగ్ బ్లౌజులు ప్యాక్ చేయించింది. నేను మ ఆయన సైగ మేరకు మా బడ్జెటు అర్థం చేసుకుని ఒక్క చీర మాత్రమే కొన్నాను. షాపింగు ముగించి వెనుదిరిగాం.

పెళ్ళి కార్యక్రమాలు ముగిసినై. ఒక దినమంతా, కొత్త జంటను వెంటతీసుకొ నగరంలోని విహార స్థలాలు తిరిగాం. ఆ మర్నాడు తిరుగు ప్రయాణానికి ఉద్యుక్తులమయ్యాం.

"ఉమా! ఈ అక్కయ్య ఉందన్న విషయ మర్చిపోకు. సంక్రాంతి పండగకు మీరిద్దరూ కలి మా వూరికి రండి. తప్పకుండా." అన్నాను.

ఉమ సాశ్రునయనాలతో తలవూపింది.

సావిత్రి కూడా, "ఎల్లప్పుడూ మీకు వ స్వాగతం. ఇదిగో అబ్బాయీ! ఈ పిల్ల చదువు ఆటంకం రానీకు. చక్కగా ప్రోత్సహించు. తొంద పాటు కూడదు. అర్థమైందా....." అన్నది.

పెళ్లికొడుకు తెగ సిగ్గు పడిపోయాడు.

అప్పుడే వెళ్లి పోతా రా, ఇంకొక్క రోజు ఉం పొమ్మన్నాడు సాంబమూర్తి . అసలే నగర అతనిది చిన్న ఇల్లు - అందులోనూ చుట్టాలు,

సంబంధీకుల నందడి. అనవసర ఖర్చులూ, ఇబ్బందులూ అతని మీద మోపడం మాకు నచ్చలేదు. మరోసారెప్పుడయినా వస్తామని చెప్పి సెలవు తీనుకున్నాము.

రైల్లో సావిత్రి కిటికీ దగ్గర కూర్చుంది. కొత్త వారపత్రిక కొన్నది. ఒకసారి బిస్కట్లు, మరోసారి స్నాక్స్ నములుతూ చదవడంలో మునిగినా, జాగ్రత్తలో లోపం రానీయ లేదు. కాళ్ల దగ్గర, సీటు కింద ఎయిర్ బ్యాగు, పెద్ద నూటుకేనును మధ్య మధ్య చేతితో తడిమి చూనుకుంటోంది. బ్యాగులో బంగారు నగలు - నెక్లెనూ, గొలునూ లాంటివి ఉన్నాయి కాబోలు. నూటు కేనులో ఎన్ని చీరలున్నాయో నేను ఊహించగలను. కిటికీలోంచి సాయంకాలపు ఎండ ఆమె మీద పడుతూ ఆమె అందాన్ని ద్విగుణీకృతం చేస్తోంది. ఆమె కదుల్తున్నప్పుడు ఆమె చెవి జూకాల రాళ్లలోంచి కాంతి పుంజాలు ఎగసి పడుతున్నాయి.

ఆమె అందం ఆమెదే, ఆమె భాగ్యం ఆమెదే. వాట్ని గురించి నాకు ఎలాంటి అనూయ లేదు. కాని ఆమెలో నేను నచ్చని గుణం - నాకు అర్థం కాని లక్షణం ఒక్కటె. తన ఆడంబరాలకు, అవనరాలకు నంబంధించిన ఖర్చుకు వెనుకాడదు కాని వరాయి వాళ్ల మేలు గూర్చి ఆలోచించదు ఈమె. నమాజంలో ఇలాంటి మనస్తత్వం గల వ్యక్తులు చాలా మందే ఉండి ఉంటారు. వీళ్లు సామాజిక హోదా ప్రదర్శించుకొనేందుకు తాపత్రయపడతారు. అది తప్పు అని నేను భావించను. అయితే ఒక వైపు ఇలా ప్రయత్నిస్తూనే, మరో వైపు అణా, కానీలకోసం గింజుకుంటారు. రిక్షాల దగ్గర, మోచీల దగ్గర, పండగ బక్షీసు ఇచ్చేటప్పుడూ, పని మనిషి అనారోగ్య కారణాలతో గైర్హాజరు అయినప్పుడు మాజీ చేసేందుకూ, తాజా కూరగాయలు గంపల్లో అమ్ముకునే పల్లెటూరి అమ్మి సరకులకు వెల కట్టేటప్పుడూ..... పైసా పైసా తగ్గించి ఇచ్చే ఒక రకమైన పిసినారి గుణం అవలంబిస్తారు. చిన్న వృత్తులు జీవనోపాధిగా గల వాళ్ల సేవలు గుర్తింపు లేనివిగా అగుపించవచ్చు. కాని అవి మనకు చాలా అవసరం. వాళ్లు తమ సేవలకు అడిగే మూల్యం సాధారణంగా తగినట్టుగానే ఉంటుంది. ఒక వేళ ఆ మూల్యం కొస్త ఎక్కువయినా - ఆ 'ఎక్కువ' మనం పెట్టే వందలాది ఖర్చుల్లో 'లెక్క'కు రాదు. అయితే సేవ అందించిన వాడు పొందే తృప్తి మాత్రం అపారం. ఈ సూక్ష్మ విషయం అర్థం చేసుకోలేని కోవకు చెందిన మనుమల్ని ఏమనాలో నాకు తెలీదు.

రాత్రి తొమ్మిది గంటలకు రైలు మా వూరి స్టేషనులో ఆగింది. మేము కూర్చుని ఉన్న బోగీ ప్లాటుఫారంకు దూరంలో ఉంది. దిగి గబగబ నడుస్తున్నాం మేము. వెనుక బాలకృష్ణ దంపతులు ఉన్నారు.

"ఏమండీ... మిమ్మల్నే....ఆగండి పోర్టరును పిలవండి..." సావిత్రి భర్తను పిలుస్తోంది. మేం వెనక్కి తిరిగి చూశాం

"ఏమిటి? ఏమయింది?" బాలకృష్ణ అడుగుతున్నాడు.

"ఆ నూటుకేను, నంచీ పోర్టరు కివ్వండి. ఈ బ్యాగు మీరు పట్టుకోండి. నేను నడవలేను. చెప్పు తెగింది మళ్ళీ.... అదే చెప్పు...." సావిత్రి నిలబడి అంటోంది కాళ్ల వేపు చూనుకుంటూ.

బాలకృష్ణ పిలవగా, వాళ్ల వేపు గబగబా పోతున్న పోర్టరును చూస్తే నాకు జాలి కలిగింది - కూలీ గురించి సావిత్రి ఎంతగా వేధిస్తుందోనని!

- లేక ఇప్పుడయినా ఆమె ధోరణిలో మార్పు వస్తుందా....?

ఆసక్తిగా గమనించాను. వాళ్ల మధ్య కూలీ ఊసు రాలేదు. పోర్టరు సామాన్లు స్టేషను బయట ఆటోలో పెట్టి, చేయి చాపాడు. బాలకృష్ణ అడిగినంత డబ్బు ఇచ్చాడు. సావిత్రి మౌనం వహించింది.

సేవ, మూల్యాల అనుపాతం అనులోమమనీ, కూలి వాడి తృప్తికి స్పష్టీకరణ వాడి పనితనంలోని నాణ్యత అనీ సావిత్రి అర్థం చేసుకుందనీ నేను భావిస్తాను.


# సంక్రాంతి శుభాకాంక్షలు

andhra pradesh
AGROS

ఉన్నతశ్రేణి నాణ్యతగల ఆగ్రో పురుగు మందులతో
కీటకాల వినాశనం, రైతన్నలకు ఉపశమనం

1. ఆగ్రో మోనోక్రోటోఫాస్
2. ఆగ్రో ఎండోసల్ఫాన్
3. ఆగ్రో క్వినాల్ఫాస్
4. ఆగ్రో క్లోరోఫైరిఫాస్
5. ఆగ్రో బి.హెచ్.సి.

రాష్ట్రమంతటా వ్యవసాయశాఖ రాయితీలో
ఆగ్రోవిక్రయ సేవా కేంద్రాలలో పై పురుగు మందులు లభించును



ఆగ్రోస్ వారి సహకారంతో
అందుకోండి సువర్ణావకాశాన్ని
నింపండి స్వర్ణరాసులతో

తయారుచేయువారు :
ఆం.ప్ర. రాష్ట్ర వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి సంస్థ
రిజిష్టర్డ్ ఆఫీసు : 'ఆగ్రోభవన్' 10-2-3, ఎ.సి. గార్డ్స్ హైదరాబాదు - 500 004